16 నుంచి వేట వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

గార్ల, అక్టోబర్ 14: మండలంలోని మర్రిగూడెంలో వేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి నవంబర్ 23 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు 16న ప్రత్యేక పూజలు, 17న ధ్వజారోహణం, 12.15 గంటలకు కల్యాణ మహోత్సవం, 18న నిత్యహోమం, 19న గరుడవాహన సేవ, 20న సాయంత్రం కోనేటిలో తెప్పోత్సవం, 21న పారువేట, అశ్వవాహన సేవ, 22న దోపోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

స్వామి వారి మూలవిరాట్

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగురాలు భాగ్యలక్ష్మి

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. తాను పారాఒలింపిక్ త్రోబాల్ క్రీడలకు ఎంపికయ్యాయని, ఇండోనేషియాకు వెళ్లేందుకు రూ.90వేలు ట్రావెల్ ఖర్చులు మంజూరు చేయాలని గూడూరు మండలానికి చెందిన దివ్యాంగురాలు భాగ్యలక్ష్మి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. రెవెన్యూ శాఖకు సంబంధించి 22, పంచాయతీ రాజ్‌కు 3, ఎస్టీ వెల్ఫేర్‌కు 5, మున్సిపాలిటీకి 3, బ్యాంకింగ్‌కు 2, వైద్యారోగ్య శాఖకు 4 ఇలా మొత్తం 46 వినతులు వచ్చాయని కలెక్టర్ వెల్లడించారు. వాటిని శాఖల వారీగా విభజించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్‌టోప్పో, అధికారులు పాల్గొన్నారు.

రెండు ఉద్యోగాలు సాధించిన సాయికుమార్

కురవి, అక్టోబర్ 14 : కురవి మండలం రేకులతండా(కే) గ్రామశివారు రామచంద్రపురానికి చెందిన మరిపెల్లి సాయికుమార్ తొలి ప్రయత్నంలోనే రెండు ప్రభుత్వ కొలువులు సాధించాడు. మరిపెల్లి ఎల్లయ్య, లచ్చమ్మ దంపతుల కొడుకు సాయికుమార్ డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ 6వ ర్యాంకు, , బీసీ సంక్షేమ గురుకులంలో పీఈటీ ఉద్యోగం సాధించాడు. ప్రభుత్వం అందించిన నియామక పత్రాన్ని తల్లిదండ్రుల సమక్షంలో అందుకున్నాడు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ... నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి, తల్లిదండ్రుల కష్టార్జితంతో చదువుకున్నానని, ఆర్థికంగా లేకున్నా డీఎస్సీలో ర్యాంక్ సాధించినట్లు తెలిపాడు. రెండు ఉద్యోగాలు సాధించిన సాయిని గ్రామస్తులు, మండల ప్రజలు అభినందించారు.

తల్లిదండ్రుల చేతులమీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయి

కాంగ్రెస్ నాయకుడికి బీఆర్ఎస్ కండువా కప్పుతున్న బీరవెల్లి

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

గూడూరు, అక్టోబర్ 14 : కాంగ్రెస్ పార్టీ అయోధ్యపురం గ్రామ యూత్ నాయకుడు సోమవారం బీఆర్ఎస్‌లో చేరాడు. రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోల శ్రీధర్ బీఆర్ఎస్‌లో చేరగా, భరత్‌కుమార్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీరవెల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలో వచ్చిందని, ఇప్పటివరకు ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రాష్ర్టాన్ని అధోగతి పాలు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, తులసీరాం, ముత్యం సుధాకర్, యాకయ్య, ఆగారెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీను, మల్లేష్, రవీందర్ పాల్గొన్నారు.

గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

మహబూబాబాద్ రూరల్ : వచ్చేనెల 24, 25న జరిగే గిరిజన రాష్ట్ర సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్ననాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్ వద్ద ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీతారాంనాయక్, కిషన్, సాయికుమార్, పార్వతి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన లైన్‌మెన్లు

దంతాలపల్లి, అక్టోబర్ 14: మండలంలోని దంతాలపల్లి, పెద్దముప్పారం సెక్షన్లకు నూతనంగా బదిలీపై వచ్చిన లైన్‌మెన్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దముప్పారం సెక్షన్ లైన్‌మెన్‌గా యాకూబ్‌రెడ్డి, దంతాలపల్లి సెక్షన్ లైన్‌మెన్‌గా సైదులు బాధ్యతలు స్వీకరించగా, ఐఎన్‌టీయూసీ 327యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సికిందర్ వారికి స్వాగతం పలికారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్
- డోర్నకల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

డోర్నకల్, అక్టోబర్ 14 : కేసుల విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ పోలీ సు అధికారులను ఆదేశించారు. సోమవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొద ట పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, కిట్ ఆర్టికల్స్ పరిశీలించా రు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ ఉండాలని, ఫిర్యాదులను అధికారులు సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యా దు అందిన వెంటనే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. కేసుల నమోదు విషయంలో తాత్సారం చేయొద్దని సూచించారు. ప్రతి కేసులో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, తద్వారా బాధితులకు సరైన న్యా యం జరుగుతుందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సరిహద్దు రాష్ర్టాల నుంచి అక్రమ రవాణా నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కారించాలని, బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్ కారుతో నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. పోలీసు సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తేనే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయన్నారు. రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సీఐ భూక్యా రాజేశ్, ఎస్సై వంశీధర్, ఏఎస్సై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డోర్నకల్ పోలీసు స్టేషన్‌లో పోలీసు సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

నర్సింహులపేట పెట్రోల్ బంక్ వద్ద నీళ్ల పెట్రోల్ చూపిస్తున్న వినియోగదారుడు

పెట్రోల్‌లో నీళ్లు

బంక్ దగ్గర వినియోగదారుడి ఆందోళన

నర్సింహులపేట, అక్టోబర్ 14 : పెట్రోల్‌లో నీళ్ల రావడంతో తన బైక్ రిపేర్‌కు వచ్చిందని మండలంలోని కొమ్ములవంచకు చెందిన దాసరి సమ్మయ్య మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింహులపేట పెట్రోల్‌బంక్‌లో రూ.100 పెట్రోల్ పోసుకుని బైక్‌పై ఇంటికి వెళ్లానన్నాడు. తర్వాత బైక్‌ను స్టార్ట్ చేస్తే ఆన్ కాకపోవడంతో ట్యాంక్‌లోని పెట్రోల్‌ను డబ్బాలో తీసుకొని బంక్ దగ్గరకు వచ్చి అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అన్నా రు. అలాగే పిచ్చిరాంతండాకు చెందిన భూక్యా బాలు అనేవ్యక్తితోపాటు పలువురి బైక్‌లు కల్తీ పెట్రోల్ వల్ల రిపేర్‌కు వచ్చాయని గొడవకు దిగారు. బంక్ యాజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పెట్రోల్, డీజిల్ బంక్‌లో తనిఖీలు చేసి కల్తీ చేస్తున్న బంక్‌లను మూసివేయాలని కోరారు.

ఇందిరమ్మ కమిటీలా..? పార్టీ సొంత కమిటీలా?

కొత్తగూడ, అక్టోబర్ 14 : ఇందిరమ్మ కమిటీలు కాంగ్రెస్ పార్టీ సొంత కమిటీల్లా ఉన్నాయని, ఎలాంటి నిబంధనలు పాటించకుండా పార్టీ కార్యకర్తలతో కమిటీలు వేసుకుంటున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య అన్నారు. సోమవారం పాకాల కొత్తగూడ పాలడుగుల కృష్ణ భవన్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం పంచాయతీ స్థాయి కమిటీలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, గ్రామసభలు జరిపి కమిటీలను ఎన్నుకోవాల్సి ఉండగా, ఎలాంటి నిబంధనలు పాటించకుండా సొంత కమిటీల్లా వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని, తక్షణమే ఆ కమిటీలను రద్దు చేసి నూతనంగా గ్రామసభలు ఏర్పాటు చేసి కమిటీలను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు బూర్క వెంకటయ్య, ఆగబోయిన నర్సక్క, ఇడంపాక శ్రీశైలం, గజ్జి లింగన్న, యాదగిరి, యుగేందర్, బొమ్మగాని వెంకన్న, గట్టి సురేందర్, బూర్క బుచ్చి రాములు, రాజమల్లు, పాల్గొన్నారు.

పిడుగు పడి మూడు పశువులు మృతి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : పిడుగు పడి మూడు పశువులు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బలరాంతండాకు చెందిన పెద్దపులి ఫకీరా అనే రైతు తనకు ఉన్న మూడు ఆవులను ఇంటి పక్కన కొట్టంలో కట్టేసి తోట పనికి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి, ఒక్కసారిగా కొట్టం పక్కనే ఉన్న చెట్టు మీద పిడుగుపడి మూడు పశువులు మృతిచెందాయి. రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ అధికారులు పంచనామా నిర్వహించారు. సుమారు రూ.లక్షా 60వేల విలువైన పశువులు మృతి చెందాయని, ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరారు.

పశువుల వద్ద రోదిస్తున్న రైతు

ఉపాధ్యాయుడిగా ఎంపికైన రవికి సన్మానం

నెల్లికుదురు : డీఎస్సీ-24 ఫలితాల్లో తెలుగు పండిట్ ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన మండలంలోని నైనాల గ్రామానికి చెందిన బొడ్డు రవి కుమార్‌ను జాతీయ మాల మహానాడు గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డు రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. టీచర్ కావాలనే తన జీవితాశయం నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరయ్య, నాగయ్య, సాయిలు, శ్రీనివాస్, సహదేవుడు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

నైనాలలో బొడ్డు రవికుమార్ సన్మానిస్తున్న స్నేహితులు, బంధువులు

జడ్పీ సీఈవోగా పురుషోత్తం బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయ సీఈవోగా పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జడ్పీ సీఈవోగా విధులు నిర్వర్తించిన రమాదేవి జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందారు. ఆమె స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డీఆర్‌డీవోగా విధులు నిర్వర్తిస్తున్న పురుషోత్తం వచ్చారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ కార్యాలయ అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్పీ సీఈవో పురుషోత్తం

చదువులెట్లా..?

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- రూప్లాతండా పాఠశాలలో చెత్తాచెదారం
- నిరుపయోగంగా మూత్రశాల, మరుగుదొడ్లు

నర్సింహులపేట : దసరా సెలవులు ముగిశాయి. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలే స్వాగతం పలుకనున్నాయి. అధికారులు పర్యవేక్షణ, నిర్ల క్ష్యం కారణంగా అమ్మ ఆదర్శ పాఠశాలలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నర్సింహులపేట మండలంలో రూప్లాతండా పాఠశాలలో సమస్యలు తిష్టవేశాయి. వాటర్ ట్యాంకులో చెత్తాచెదారం పేరుకుపోయి కంపు కొడుతున్నది. చేతులు కడుక్కునే వాష్ ఏరియాలో నల్లాలు లేకపోవడం, మూత్రశాలలు, మరుగుదొడ్లు వాడడానికి వీలు లేకుండా ఉన్నాయి. దీంతో నేటి నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు తిప్పలు తప్పేట్లు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి, వసతులు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూప్లాతండా పాఠశాల వాటర్‌ట్యాంక్‌లో చెత్తాచెదారం

నిరుపయోగంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు

హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సత్యవతి

హెడ్ కానిస్టేబుల్‌కు మాజీ మంత్రి నివాళి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : కలెక్టరేట్‌లో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్ వద్ద ఆదివారం హెడ్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్ గన్‌తో కాల్చుకొని మృతి చెందారు. సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఆయన స్వగృహంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీరామ్, మార్నేని రఘు పాల్గొన్నారు.

20న చలో హైదరాబాద్

తొర్రూరు, అక్టోబర్ 14 : టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం సందర్భంగా ఈ నెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. డివిజన్ కేంద్రంలో రిక్షా ఎగుమతి హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులపై ప్లాన్ ప్రకారం దాడి చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా 46 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న దేశద్రోహ చట్టాలను తిప్పికొట్టడానికి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న విలీన సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బీకు, గుంతడాల సోమనర్సయ్య, మంగళపల్లి సాయిలు, యాకయ్య, వడ్లకొండ లక్ష్మయ్య, వెంకటయ్య, రాజు, మహేశ్, వెంకన్న, రాము, రమేశ్, మహేందర్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో పూర్తి స్థాయి వైద్యం అందించాలి

గూడూరు, అక్టోబర్14 : గూడూరు సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)లో పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్యపరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. సీహెచ్‌సీలో 30 పడకలు పేరుకు మాత్రమేనని, పూర్తిస్థాయిలో వైద్యులు లేరన్నారు. ఉన్న వైద్యులు కూడా షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. దవాఖానలో మందులు, సరైన పడకలు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని, గతంలో కలెక్టర్ విజిట్ చేసినా ఫలితం శూన్యమన్నారు. వెంటనే దవాఖానలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య, బుచ్చిరామయ్య, సత్యనారాయణ, సత్యం పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మహబూబాబాద్ రూరల్ : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం మోస్తరు, చిన్నగూడూరు, దంతాలపల్లి, నర్సింహులపేట, బయ్యారంలో తేలికపాటి వర్షం కురిసింది. ఇక పట్టణంలోని కృష్ణకాలనీ, రామచంద్రాపురం కాలనీ, పాతబజార్‌లో భారీ వర్షం పడింది. రహదారులు మొత్తం నీటితో నిండిపోయాయి. కొత్తగూడ మండంలో 0.6 సెంటీమీటర్లు, గంగారంలో 0.2, బయ్యారంలో 0.8, గార్లలో 1.6, డోర్నకల్‌లో 2.6, కురవిలో 1.3, మానుకోటలో 3.7, గూడూరులో 2.7, కేసముద్రంలో 1.7, నెల్లికుదురులో 0.6, నర్సింహులపేటలో 2.0, చిన్నగూడూరులో 1.5, మరిపెడలో 0.3 దంతాలపల్లిలో 1.2, తొర్రూరులో 2.1, పెద్దవంగరలో 2.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

చిన్నగూడూరు, అక్టోబర్14: మండలంలోని ఉగ్గంపల్లి దేవోజితండాకు చెందిన ధరంసోత్ చంద్రూనాయక్ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చంద్రూనాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కేసముద్రం నుంచి విజయవాడకు ..

కేసముద్రం, అక్టోబర్ 14: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కేసముద్రం మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ నెల13న దుర్గామాతకు మండల కేంద్రంలో శోభాయాత్రను నిర్వహించి విజయవాడకు తీసుకెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ మిత్ర మడంలి అధ్యక్షుడు చిలంచర్ల సతీశ్, శ్రీరాం చంద్రన్‌కుమార్, ఓమ సంతోష్, బోగోజు వేణుగోపాలాచారి, ప్రసాద్, లెంకలపల్లి సంతోశ్, మాలె రవి, బోనగిరి శ్రీకాంత్, రాపాక కుమారస్వామి, నాగేశ్వరాచారి, సుగుణాసాగర్ పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేస్తున్న వాసవి సభ్యులు

శ్మశాన వాటికను వెంటనే నిర్మించాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : మండలంలోని ఈదుల పూసపల్లి గ్రామంలో శ్మశాన వాటిక నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు సమ్మెట రాజమౌళి అన్నారు. ఈ మేరకు సోమవారం కౌన్సిలర్ లక్ష్మారెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇక్కడ శ్మశాన వాటికను నిర్మించ లేదన్నారు. ఈ కార్యక్రమంలో గౌని వెంకన్న, లక్ష్మీనారాయణ, విజయ్, అశోక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు హరీశ్‌రావు రాక

చిన్నగూడూరు, అక్టోబర్ 14: తెలంగాణ ఉద్యమ, సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో ఆయన దశదిన కర్మలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12గంటలకు పురుషోత్తమాయగూడేనికి చేరుకుంటారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : స్కాలర్ షిప్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని నలంద కళాశాల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ అన్నారు. పట్టణంలో వివిధ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడేళ్లుగా డిగ్రీ, పీజీ కళాశాలలకు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయక పోవడం బాధాకరమన్నారు. వెంటనే ఫీజు బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్ కృష్ణప్రసాద్, వీరన్న, వెంకటేశ్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

డోర్నకల్ : డోర్నకల్ పశువైద్యశాల పరిధిలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 9వరకు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. సోమవారం డోర్నకల్ పశువైద్యశాలలో ఆయన మాట్లాడుతూ.. వ్యాధి సోకిన పశువుల నోట్లో, కాలి గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఎద్దులు వ్యవసాయానికి పనికి రాకుండా పోతాయన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పాలు ఇచ్చే గేదెలు, ఆవులతో పాటు చూడి గేదెలకు వేయించాలన్నారు. వందశాతం పశువులకు టీకాలు వేయించి, గాలి కుంటు వ్యాధి నుంచి రక్షించుకోవాలన్నారు.

గార్లలో..

గార్ల, అక్టోబర్14: గార్ల, ముల్కనూర్ పశువైద్యశాలల ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 8వ వరకు ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి సురేశ్, ముల్కనూర్ పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. 15న బుద్దారం, 19న గార్ల, 24న పోచారం, 28న గోపాలపురం, 2న మర్రిగూడెం, 8న పుల్లూరు గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తొర్రూరు, అక్టోబర్ 14: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన కోన వరుణ్(22) ఫొటోగ్రఫీ వృత్తిగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన మిత్రుడు సాయిసూర్యవర్ధన్‌తో కలిసి హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు బైక్‌పై వస్తుండగా తొర్రూరులోని అమ్మాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో బొలెరో వాహనం తగిలి కిందపడిపోయారు. వరుణ్‌పై నుంచి వాహనం వెళ్లడంతో కడుపు భాగం పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిసూర్యవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వరుణ్ బాబాయి రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు పాఠశాలల కేటాయింపు

మహబూబాబాద్ రూరల్ : డీఎస్సీ-2024లో ఎంపికైన టీచర్ అభ్యర్థులకు మంగళవారం పట్టణంలోని ఫాతిమా హైస్కూల్‌లో పాఠశాలలను కేటాయించనున్నట్లు డీఈవో రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ నియామకపత్రం, మూడు ఫొటోలతో హాజరు కావాలన్నారు. స్కూల్‌అసిస్టెంట్స్, లాంగేజ్ పండిట్లు, ఎస్జీటీలు సకాలంలో హాజరు కావాలని డీఈవో పేర్కొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు- మన బడి, అంగన్‌వాడీ కేంద్రాల్లో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లో ఆయన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, బాలికలకు ప్రత్యేక వసతులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్స్, పెయింటింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్, ఆర్‌అండ్ బీ అధికారులు పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 14 : అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానంగా చిన్నగూడూరు, నర్సింహులపేట, మరిపెడ, గూడూరు వంటి సెంటర్లలో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, సుమారుగా 17మంది వ్యక్తులు తమ ట్రాక్టర్ల ద్వారా పలు శాఖల అధికారుల మద్దతుతోనే ఇసుకను తరలిస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

తొర్రూరు : ప్రొఫెసర్ సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని విశాంత్రి భవన్ వద్ద సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఉపేందర్‌రెడ్డి, బుదారపు శ్రీనివాస్, మురళీకృష్ణ మాట్లాడుతూ.. దళిత వర్గంలో జన్మించి 90శాతం అంగవైల్యమున్నా, అనేక అవరోధాలను అధిగమించి కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని గుండె నిబ్బరంతో ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజలపై సాగుతున్న దోపిడీ, అక్రమ కేసులు తప్పని పాలకులను నిలదీసి, పీడిత వర్గాల పక్షాన పోరాటం చేశారని అన్నారు. కొత్తపల్లి రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గూడెల్లి ఎల్లయ్య, జనార్దన్, సబియా భాను, వెంకటాచారి, బుచ్చిరాములు, వెంకన్న, కొలుపుల శ్రీను, రమేశ్, ఎల్లారెడ్డి, రవీందర్, బాలాజీ, చంటి, లక్ష్మణ్, బాలు, నరేందర్, మహేశ్ పాల్గొన్నారు.

విప్లవ మేధావిని కోల్పోయాం..

మహబూబాబాద్ రూరల్ : విప్లవ మేధావిని కోల్పోయామని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ అన్నారు. సోమవారం అంబేద్కర్ సెంటర్‌లో ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమానాయక్, మహేశ్, ఆనంద్, మోహన్, వెంకన్న, మంగీలాల్, భాస్కర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

మరిపెడ : ఉల్లెపెల్లి గ్రామంలో స్థానికులు ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్ ఆవిష్కరించారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, దివాకర్, వెంకన్న, సత్యనారాయణ, రాజబాబు, సతీశ్ పాల్గొన్నారు.